Andhra Jyothy D- 19/12/16.



మెట్రో రైళ్లు సిద్ధం!! మూడు కారిడార్లలో తిరిగే 57 మెట్రో రైళ్లు.. 171 కోచ్‌లు నగరానికి చేరుకున్నాయి. మెట్రో డిపోల్లో వీటిని ఉంచారు.

# మెట్రో రైళ్లన్నీ సిద్ధం



- సౌత్‌కొరియా నుంచి నగరానికి
- మొత్తం 57 రైళ్లు... 171 కోచ్‌లు
- ఒక్కో కోచ్ ధర రూ.10 కోట్లు
- ఒక రైల్‌లో 3వేల మంది ప్రయాణం

**మెట్రో ప్రాజెక్టులో కీలకమైన ఒక ఘట్టం పూర్తయింది. హైదరాబాద్ మహానగరంలో 73 కి.మీ మేర మూడు కారిడార్‌లలో తిరిగే 57 రైళ్లు నగరానికి వచ్చాయి. మరో ఐదేళ్ల వరకు ఈ రైళ్లతోనే మెట్రో రవాణా నగర వాసులకు అందుబాటులో ఉండనుంది.**

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్‌సిటీ: దక్షిణ కొరియాకు చెందిన హుండ్యాయ్ రొటెమ్ కంపెనీ నుంచి హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ మొత్తం 57 రైళ్లను కొనుగోలు చేసింది. ఒక రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. ఇందులో భాగంగా మొత్తం 171 కోచ్‌లను దశల వారీగా దక్షిణ కొరియా నుంచి సముద్ర మార్గం ద్వారా చెన్నై పోర్టుకు, అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నగరానికి తీసుకొచ్చారు. ఉప్పల్, మియాపూర్‌లో ఉన్న మెట్రో డిపోల్లో వీటిని ఉంచారు. దేశంలోని మెట్రో నగరాల సరసన చేరిన హైదరాబాద్ మహానగరంలో పెరిగే ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని మెట్రో రైళ్ల డిజైన్‌ను, వాటిని నడిపించే వ్యవస్థను రూపొందించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మెట్రో రైళ్ల సొంతం.

ఇందులో ఆటోమెటిక్ ట్రైన్ ప్రొటెక్షన్, ఆటోమెటిక్ ట్రైన్ ఆపరేషన్స్, ఆటోమెటిక్ ట్రైన్ సూపర్‌విజన్, ప్యాసింజర్ ఎమర్జెన్సీ అలారం, ప్యాసింజర్ అడ్రస్ సిస్టం, సీసీటీవీలు, ఎయిర్‌బ్రేక్ సిస్టం, స్మోక్ అండ్ ఫైర్ డిటెక్టర్స్ లైట్ వెయిట్ స్టెయిన్‌లెస్ స్టీల్ బాడీ కోచ్‌లు, ఆటోమెటెడ్ డోర్ సిస్టం వంటివి ప్రధానంగా ఉన్నాయి. ఒక మార్గంలో గంటకు 30 రైళ్లను నడిపేందుకు అవకాశం ఉంది.

### ఒక్కో కోచ్ ఖరీదు రూ.10 కోట్లు....

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మెట్రో రైళ్లను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ నగర వాసులకు పరిచయంచేస్తోంది. ఒక్కో కోచ్ ఖరీదు రూ.10కోట్లు. ఒక్కో మెట్రో రైలు మూడు కోచ్‌లను కలిగి ఉంటుంది. 171 కోచ్‌లతో 57 రైళ్లన్నీ మూడు కారిడార్‌లలో కారిడార్-1 (మియాపూర్ -ఎల్‌బీనగర్), కారిడార్-2 (జేబీఎస్-ఫలక్‌నుమా), కారిడార్-3 (నాగోల్- రాయదుర్గం)లో ఇవి పరుగులు పెట్టనున్నాయి. ప్రతి 2 నిమిషాలకు ఒక మెట్రోరైలు నడిపేలా ప్రాజెక్టును రూపొందించారు. ఒక్కో మెట్రో రైలులో సుమారు 3వేల మంది ప్రయాణికులు ప్రయాణించే వీలు ఉంటుంది. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా భవిష్యత్తులో 90 సెకన్లకు ఒక రైలును నడిపేలా అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 3 కోచ్‌లతో రైళ్లను నడపాలని నిర్ణయించగా, మరో ఐదేళ్ల తర్వాత 3కోచ్‌ల స్థానంలో 6 కోచ్‌లను ప్రవేశ పెట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు.